# రవ్వలు గవ్వలు



"సుమిత్రా! సుమిత్రా! గెట్ రెడీ! పదినిమిషాలు టైమిస్తున్నాను. ఇవాళ నీ పుట్టినరోజు కదూ! నీకో సర్ప్రైజ్!'' అంటున్న అతని ధోరణి నా కర్థంకాలా! బుగ్గమీద వేలేసుకుని కళ్ళు చక్రాల్లా తిప్పుతూ ఏం గిఫ్ట్ తెచ్చారోనని చూస్తున్నా.

"తెలిసిందిలే మనసేమిటో, కానీ నీలం పట్టుచీర, ముత్యాలహారం తేలేదు సుమీ! 'డిసప్పాయింట్' అవకు. ఈ సారి నీకు బహుమతి ఏమిటో తెలుసా? మనం యివాళంతా హాయిగా కళింగపట్నం సముద్రపు టొడ్డున గడిపి వద్దాం. ఏం? కారు పట్టుకొచ్చాను. మరి రాణీగారు చీర సింగారించాలి, ఊరు మాటుమణగకుండా. ఇది మనం పోస్ట్పోన్ చేసిన హనీమూన్ ట్రిప్ అన్నమాట. తెల్సిందా? మీ ఫ్రెండ్ కాశ్మీర్‌దాకా వెళ్తే నువ్వు కనీసం కళింగపట్నందాకా వెళ్ళిరావద్దా?

"మీరు నన్నేం వుడికించ నక్కర్లేదు. నేను కాశ్మీరే అన్నాను కానీ తమరు పెళ్ళికాకముందు 'స్విట్జర్లండు' తీసికెళ్తానని చెప్పలేదూ! అయినా యిప్పుడేం నేను కాశ్మీర్ కోసం వెఱ్ఱెత్తిపోతున్నానా?'' అన్నా.

''అహహ. అప్పుడే కోపంవచ్చేసింది. లెట్ బైగాన్స్ బి బైగాన్స్! వెధవది స్విట్జర్లండేమిటీ! నిన్ను యూరప్, అమెరికా అన్నీ తిప్పి తీసుకురానూ. పద పద మంచిదానివి కాదూ! సుమిత్ర మంచిపిల్ల అని 'రాముడు బుద్ధిమంతుడు'కి బదులుగా వచ్చేఏడు తెలుగు పుస్తకాల్లో అచ్చేస్తారుట! తెలిసిందా! ముక్కు చప్పిడి ముక్కయినా ఎంత కోపమో! ముక్కుమీదే వుంటుంది."

'బొంబాయి వెళ్ళి బోటులెక్కుదాం'... అంటూ పాడుకుంటూ బట్టలు మార్చుకోటానికి వెళ్ళేరాయన.

నాకూ బలే సంతోషం వేసింది. నిజానికి పెద్దపెద్ద సిటీస్ కంటే మాకిద్దరికీ చిన్నవూళ్ళే యిష్టం. గబగబ, నిస్కట్లూ, శాండ్‌విచెస్, ముందునాడు చేసిన చేగోడీలు, కాఫీ ఫ్లాస్కూ, తువ్వాళ్ళూ అన్నీ చిటికెలో సర్దేశాను.

నా చీరమీదుగా వేసుకున్న 'షాల్'నిచూసి.

''మనం కాశ్మీర్‌కి కాదు వెళ్తాంట. కళింగపట్నానికి'' అన్నారాయన నన్ను మరోసారి ఏడిపించాలని.

''తెలుసు లేవోయ్. బడాయి చేయక. నన్ను వెక్కిరించారు కానీ ఊరు మాటు మణుగుతుందని. తమరి సింగారం యింకా పూర్తి కాలేదు.''

"మరి నీ దగ్గిర భయం సుమిత్రా. అందంగా కన్పించకపోతే నీ పక్కన నుంచుంటే చూసేవాళ్ళే మనుకుంటారు!

ఇదుగో కెమెరాలో ఫిల్మ్ లోడ్ చేసే స్తున్నా. యివాళ డజను ఫోటోలు నీకు తీస్తాను, నా యిష్టం వచ్చినట్టు."

సరే ఎలాగైతేనేం కారులో పడ్డాం. కళింగపట్నం యిట్టే వచ్చేసింది. కారులో కాసేపన్నా కూచున్నట్టు లేదు. "ఏమండీ! యిక్కడికి దగ్గరే 'శాలిహుండాం' అన్న చోట బౌద్ధస్థూపాలున్నాయిట. వెళ్ళి చూద్దాం పదండి" అన్నా.

"సరే పద. మీ హిస్టరీ వాళ్ళతో వచ్చినసొదేయిది; హాయిగా సముద్రంలో సరదాగా ఆడుకోకుండా". శాలిహుండాం చూసి కళింగపట్నం చేరుకున్నాం. అక్కడికి చేరగానే, "యీ పట్టణం ఒకప్పుడు గొప్ప రేవుపట్టణం ట''... అంటుండగానే సగంలో ఆపి "నయం, అశోకుడి కథ, కళింగయుద్ధం ప్రారంభించవుకదా!'' అని వెక్కిరించారు. నాకు ఒళ్ళు మండిపోయింది. ఇతనెప్పుడూ యింతే. నేను సైన్సు స్టూడెంట్ ని కానని ఒకటే వెక్కిరింపు. సరే యిక మాటాడనని నోరుమూసుక్కూచున్నా.

''నువ్వు మంచి పిల్లవిగా - దా! స్నానం చేదాం. ఆ చీరా, గీరా పక్కన పెట్టి తువ్వాలుచుట్టుకో. చుట్టుపక్కలెవరూ లేరులే. స్నానం చేద్దాం పద'' నా గుండె గుభేలుమంది. నాకు సముద్ర స్నానమంటే తగని భయం. విశాఖ పట్నంలో అన్నేళ్ళు చదివినా 'బీచ్'లో కూచోటమేకానీ నేనెన్నడూ సముద్రంలో స్నానం చేయలేదు. ''బాబోయ్! నేను రాను నీళ్ళలోకి. ఒడ్డున కూచుని అలల్ని చూదాం" అన్నా సిగ్గుపడుతూ.

''నువ్వేం అయిపోవులే సుమిత్రా. నీ చెయ్యి పట్టుకు నేను స్నానం చేయిస్తాను రావూ!''

అంతలోనే యిద్దరు జాలరి వాళ్ళు వచ్చి ''అమ్మగోరూ! తానం చేయిచ్చమంటారా. ఒక్క బేడ డబ్బు లిప్పించండి. పోనీ గవ్వలు కొనుక్కోండమ్మగారూ." అన్నారు.

"చాల్లేవోయ్. వెళ్ళండిక్కణ్నించి. మాకు మీ సాయమేమీ అక్కర్లేదు. ఊఁ! వెళ్ళండి. పానకంలో పుడకల్లా వీ శ్శొకరు'' అంటూ కసురుకున్నారాయన. పాపం వాళ్ళు బిక్కుబిక్కుమంటూ వెళ్లిపోయారు."నువ్వు రావుగా! నేను స్నానం చేస్తాను మరి. ఎంత పిరికిదానివి నువ్వు సుమిత్రా! నేను ఎమ్. ఎస్సీ చదివేటప్పుడు మా క్లాసమ్మాయి లంతా స్టడీటూర్ కి వచ్చేరు. మేమంతా ఎన్ని వూళ్ళు చూశామనుకున్నావ్! మండపమ్, రామేశ్వరం, మద్రాసు, ఆ 'నీలూఫర్' ఎంత ధైర్యంగా సముద్రంలో స్నానం చేసేదనీ, 'ఆశాఘోష్' అనే బెంగాలీ అమ్మాయి ఎంచక్కా మాకంటే ముందే ఎన్ని 'స్పెసిమన్స్' 'గేదర్' చేసేదనీ! యింకా 'సంతోష్' అనే పంజాబీ పిల్ల



వుండేది, అబ్బ! ఏం చొరవ...ఆఁ అది సరే ఆకలేస్తోంది ఏం తిందాం!"

నా కతని ధోరణి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. ఎంత అన్యాయమైనా ఎవరో నాకు తెలీని వాళ్ళని-అందులో అమ్మాయిలని అంత పొగుడ్తుంటే మౌనంగా శాండ్ విచెస్, బిస్కట్లూ, చేగోడీలు యిచ్చాను.

అతను పకపక నవ్వుతూ, "తెలుగు పిల్లవన్పించేవు, గుడ్! చేగోడీలు కూడా తెచ్చేవు'' అంటుంటే, కోపం పట్టలేక, ''అవును నేను తెలుగుపిల్లనే. ఆ పంజాబీ పిల్లనో, బెంగాలీ ఘోష్ (ష్ట్)నో కట్టుకోకుండా నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు!" అన్నా ఉక్రోషంతో.

"అరరె! అంతకోప మెందుకోయ్! వాళ్ళతో నీకు పోలికేమిటి! నువ్వు బంగారు తల్లివి. సరేగానీ మరి నేను స్నానం చేసిరానా ; నీ అనుమతి లేందే ఒకడుగు కూడా వెయ్యలేడీ దాసుడు!'' అతనెప్పుడూ అంతే. ఇట్టే నవ్వించేయగలరు. వచ్చే నవ్వు నాపుకుంటూ 'సరే' నన్నాను.


ఆయన హాయిగా స్నానం చేస్తూ నా కేసి చూసి నవ్వుతున్నారు. అంతలోనే జాలరివాడు, ''అమ్మగోరూ! అయ్యగోరిని లోని కెళ్ళొద్దని సెప్పండి. ఇయాళ పున్నమి, పోటెక్కువవుతాది. బేగిరమ్మని సెప్పండి'' అని కేక వేశాడు. నాకు భయంవేసింది. ''వచ్చేయండీ తొందరగా'' అంటే "యిది మరీ బావుంది. నువ్వురావు సరిగదా, నన్నే నా



హాయిగా స్నానం చేయనివ్వవేం. పక్కా గంట. వుండాల్సిందే. 'కొంగు కొంగూ గట్టి కరువుతీరా బుటక లేదామా! సరిగంగ తానాలు సేదామా!' అని అతను నా వంక చూస్తూ పాడుతుండగా నే వువ్వెత్తుగా పెద్దకెరటం వచ్చింది. అతను కన్పించలేదు. "ఓయ్! జాలరీ!" అని పెద్దకేక వేశాను. నా కేక విన్పించక ముందే జాలరి దూరంనుంచి పరుగెత్తు కొచ్చి నీళ్ళలోకి యీదుకుంటూ వెళ్ళాడు. ఆ క్షణంలో ఆ జాలరి నా కళ్ళకి సాక్షాత్తూ భగవంతుడిలా తోచాడు. ఆయన్ని రక్షిస్తున్నాడు. అతనికి నా రవ్వల వుంగరం యిచ్చేస్తాను; కాదు కాదు, నా వజ్రాల హారమే యిచ్చేస్తాను. నా సర్వస్వం ధార పోసినా అతని ఋణం తీర్చగలనా? ఆయనే నా జీవితం! అతనే లేకపోతే! నా నోరెండి పోతోంది. నా కళ్ళ కేం కన్పించటం లేదు. ఆయన? ఆయనే లేకపోతే నే నెలా బ్రతుకను. భగవాన్! అనుకుంటూ ఎటో అగాధంలో పడిపో తున్నట్టూ, ఏదో మూర్ఛావస్థలో వున్నట్టూ రాయిలా నుంచుండిపోయాను.

"అమ్మగోరూ! నీల్లెక్కువ తాగనే దండీ! ఏం బయంలేదండీ. పదండమ్మ గోరూ మీ బసకాడికి" అన్నాడు జాలరి ఆయన్ని మోసుకొస్తూ.

మేముదిగిన యింట్లోకి వెళ్ళాక ఆయనకి తెలివొచ్చింది. ఒళ్ళుతుడిచి, వేడిపాలుతాగించేను. నా 'షాల్' తీసి కప్పి, 'వుడికొలోన్' తెప్పించి నుదుటికి రాస్తూ నిశ్శబ్దంగా కూచున్నా. నుదుటిమీద నాచేతిని నొక్కుతూ "పిచ్చి భయపడి పోయావుకదూ. నీకళ్ళుచూడు ఎలా ఉన్నాయో! మరేం ఫరవాలేదు. ఇవాళ రెస్ట్ తీసుకుంటేసరి. నువ్వు పడుకో. నీ 'షాల్' నాకు యిప్పుడు పనికొచ్చింది సుమా!" అన్నారు నవ్వుతూ. ఆస్థితిలో కూడా అతనిహాస్యం పోలేదు. నాకు మాత్రం ఆ రాత్రి కన్ను మూతపడలేదు. తెల్లారేసరికి మళ్ళీ మామూలు మనిషయా రాయన. మరి సముద్రం ఊసే త్తలేదు. అన్నీ సర్దేసుకుని వెళ్ళబోతున్నాం. అంతలోనే నిన్నటి జాలరివచ్చి సామాను లందుకున్నాడు కారులో పెట్టటానిక్కి. అతన్ని చూడగానే ఎందుకో గతుక్కు మన్నట్టన్పించింది. సముద్రములోంచి ఆయన బ్రతికి బయటపడ్డాక నాకు తదితర ప్రపంచం కన్పించలేదు. ఆ జాలరి నసలు పూర్తిగా మరిచేపోయాను. ఆ జాలరి నా భర్త ప్రాణదాత అన్నవిషయం గుర్తే లేదు. కానీ యిప్పుడన్నీ గుర్తొస్తున్నాయి. ఆఁ అతనికి నే నేమిస్తాననుకున్నాను! నా వజ్రాలహారం! బాబోయ్! అన్ని వేల రూపాయలే! వాడు బేడడబ్బులిస్తే స్నానం చేయిస్తానన్నాడే! ఓరూపా యిస్తేచాలదూ, కాకుంటే రెండు. అంత లోనే 'అతను నీకుచేసినసాయం వేలల్లో,



"ఇవ్వాళంతా నా ముఖం చూడనన్నావు కదూ! ఇప్పుడో!"

లక్షల్లో విలువ కట్టలేవు సుమా!' అని అంతర్యంలో అనిపించింది. సరేఅని మనసు దిటవుపర్చుకుని నా వజ్రాలహారం తీసి వాడికందించ బోయాను. ఆయన, "నీకేం మతిపోలేదుకద'' అన్నారు ఇంగ్లీషులో వాడికి బోధపడకుండా. జాలరివాడు గజ గజ వణుకుతూ, "అదే టమ్మగోరూ! ఇందులో నాను చేసిం దేమిటి? ఆ గంగమ్మతల్లి సల్లనిసూపు సూసింది. ఓ పావలడబ్బు లిప్పించండి; శాన. సుట్టముక్క కొనుక్కుంటాను.'' అన్నాడు.

ఆఖరికి బ్రతిమాలగా ఐదురూపాయలు తీసుకున్నాడు. ఊరు దాటేదాకా కారు వెనక పరుగెత్తుకొచ్చి దండాలు పెట్టేడు. కారులో మౌనంగా కూచున్న నన్ను చూసి "సుమిత్రా! కోపం వచ్చిందికదూ! ఇంకెప్పుడూ ఇలాటి అఘాయిత్యం చేయనులే" అంటుంటే, ''అదికాదండీ! రవ్వలూ, గవ్వలూ గూర్చి ఆలోచి స్తున్నాను. గవ్వలమ్మే వాడిలో ఎంత ఔన్నత్యం! మన బుద్ధుల్ని అతని బుద్ధితో సరిపోల్చి చూస్తున్నా!'' అన్నా.

నా ధోరణిని మార్చాలని అతను, "అనంత సముద్రం అట్టడుగున ఆణి ముత్యాల జోడు"... .అని పాడుతూండ గానే మా వూరు చేరేం. ★